క్లుప్తంగా

రేపు రంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

జియాగూడ: జియాగూడలోని రంగనాథ స్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా ఈ నెల 6వ తేదీన సాయంత్రం నమ్మల్వార్ పరమపద ఉత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి శేషాచార్యులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి సేవాకాలం నమ్మల్వార్ పరమపద ఉత్సవం, రాత్రి 8 గంటలకు పల్లకీ సేవ, 9 గంటలకు హారతి, షాత్తుముర్రై, రాపత్తు ఉత్సవ సమాప్తి ఉంటుందన్నారు.

హోంమంత్రికి శుభాకాంక్షలు



అబిడ్స్: టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం హుస్సేని(ముజీబ్) హోంమంత్రి మహమూద్ అలీని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 6న గగన్ విహార్ వద్ద టీఎన్జీఓస్ యూనియన్ నూతన డైరీ, కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ ఎన్నో సంవత్సరాలుగా ఉద్యోగుల సంక్షేమానికి, వారి అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



చార్మినార్: దేశ వ్యాప్తంగా భారత్ రాష్ట్ర సమితి పార్టీలో చేరడానికి పలువురు ముందుకు వస్తుండడంతో తమ పార్టీ అన్ని ప్రాంతాల్లో విస్తరిస్తోందని బీఆర్ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు. మహారాష్ట్రలోని ఆల్ ఇండియా అంజుమన్ లోహార్ జమాత్ జైపురికి చెందిన పలువురు ముస్లింలు బీఆర్ఎస్ పార్టీలో చేరారని ఆయన వెల్లడించారు. ఈ మేరకు మంత్రి మహమూద్ అలీ ఆదేశాల మేరకు తాను మహారాష్ట్రకు వెళ్లి ఈ చేరికల కార్యక్రమాలు నిర్వహించానన్నారు.

ఆపరేషన్ ఛబుత్రా

డబీర్‌పురా: డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డబీర్‌పురా పోలీసులు మంగళవారం రాత్రి ఆపరేషన్ ఛబుత్రా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై తిరుగుతున్న పలువురిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ నిర్వహించి వదిలేశారు. ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్ రావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

గౌలిపురా: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజ్ జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం గౌలిపురాలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి మోకాళ్ల వెంకటేశ్, భాగ్యనగర్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి ఇ.సుమన్‌కుమార్‌ముదిరాజ్, గౌలిపురా డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జి.రఘుకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్లేట్ స్కూల్ వార్షికోత్సవం



సాక్షి,సిటీబ్యూరో: స్లేట్ స్కూల్ వార్షికోత్సవాన్ని నాంపల్లిలోని తెలుగు లలిత కళా తోరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విభిన్నాంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల చైర్మన్ వాసిరెడ్డి అమర్‌నాథ్ మాట్లాడుతూ.. చిన్నారులకు సెల్‌ఫోన్ వినియోగం అలవాటు చేయడం మంచిది కాదని, దానికి బదులుగా ఆటలు, పాటలు నేర్పడం మంచిదన్నారు.

బీజేపీ నేతల ఇళ్లకు ఎమ్మెల్యే రాజేందర్



ధీరజ్‌లాల్ కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే

గౌలిపురా: పాతబస్తీ గౌలిపురా హనుమాన్‌నగర్‌లోని బీజేవైఎం సమావేశానికి హాజరైన ఈటల రాజేందర్ పలువురు నేతల ఇంటికి వెళ్లారు. పాతబస్తీ గల్లీల్లో కలియతిరిగారు. బీజేవైఎం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు ఎ.శివచంద్రగిరి ఇంటికి వెళ్లారు. అనంతరం యాకుత్‌పురా అసెంబ్లీ కన్వీనర్ గౌలీకర్ ధీరజ్‌లాల్ ఇంటికి వెళ్లి తేనేటి విందు స్వీకరించారు. భాగ్యనగర్ జిల్లా మీడియా కన్వీనర్ మహేందర్ తల్లి ఇటీవల మరణించగా వారి ఇంటికి వెళ్లి ఆమెకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వ్యాక్సినేషన్‌తో చిన్నారుల ఆరోగ్యం పదిలం

- ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సినేషన్ ప్రారంభించిన ప్రజాప్రతినిధులు
- చిన్నారులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని సూచన



వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: చిన్నారులకు మీజిల్స్(రూబెల్లా) వ్యాక్సిన్ వేయించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని హకీంపేట్ కుంటలోని బస్తీ దవాఖానాలో ఎం.ఆర్ వ్యాక్సినేషన్ క్యాంప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య కార్యకర్తలు సమగ్ర సర్వే చేసి వ్యాక్సిన్‌కు అర్హులైన పిల్లలను గుర్తించి ప్రతి ఒక్కరికీ వ్యాక్సిన్ వేయాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది ఎంతో క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని, పేదలు నివసించే బస్తీలలో వ్యాక్సిన్ కార్యక్రమంపై ముమ్మరంగా ప్రచారం చేయాలన్నారు. అనంతరం ఆయన హకీంపేట్ కుంట, బస్తీ దవాఖానాకు వస్తున్న ఔట్ పేషెంట్లు, అందుబాటులో ఉన్న మందుల వివరాలను వైద్య అధికారిణి డాక్టర్ అనురాధను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్ తప్పనిసరి..

యాకుత్‌పురా: చిన్నారులు ఆరోగ్యంగా ఉండేందుకు తప్పనిసరిగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పంపిణీ చేస్తున్న వ్యాక్సిన్ వేయించాలని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ సూచించారు. డబీర్‌పురా క్లస్టర్ యాకుత్‌పురా–1,2 యూపీహెచ్‌సీల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన చిన్నారులకు ఏర్పాటు చేసిన వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం వైద్యవిధాన పరిషత్ డబీర్‌పురా క్లస్టర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అంజిలా ఆల్ఫ్రెడ్ మాట్లాడుతూ.. 9 నెలలు నిండిన చిన్నారులకు మెదడువాపు నివారణకు వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. చిన్నారులకు రెగ్యులర్‌గా పంపణీ చేసే ఎంఆర్–1, పీసీవీ బూస్టర్‌తో పాటు జేఈ–1, ఎఫ్ఐపీవీ డోస్‌లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ అయేషా ముద్దాషీర్, డాక్టర్ ఫర్హా, పారామెడికల్ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పురానాపూల్‌లో..

దూద్‌బౌలి: మెదడువాపు నివారణ కోసం 9 నెలల పిల్లలకు ఉచిత జేఈ వ్యాక్సిన్‌ను తప్పకుండా ఇప్పించాలని పురానాపూల్ అర్బన్ హెల్త్ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ బుస్రా అన్నారు. బుధవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రారంభించిన ఈ వ్యాక్సినేషన్‌ను పురానాపూల్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాజ్‌మోహన్ మాట్లాడుతూ.. 9 నెలల పిల్లలకు ఈ వ్యాక్సినేషన్ వేస్తే మెదడువాపు రాకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. చిన్నారులకు ఐపీవీ మూడో డోస్ ప్రారంభించినట్లు డాక్టర్ బుస్రా తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది రజినీ, మజ్లిస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రావు, రాజు, మున్నాబాయి, తదితరులు పాల్గొన్నారు. తారా మైదాన్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో సైతం కార్పొరేటర్ రాజ్‌మోహన్ వ్యాక్సినేషన్‌ను ప్రారంభించారు.

జియాగూడ: తొమ్మిది నెలలు నిండిన చిన్నారులకు మెదడువాపు ఇమ్యూనైజేషన్ కార్యక్రమం చేపట్టినట్లు పన్నిపురా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు చెందిన డాక్టర్ సాయిప్రసన్న అన్నారు. ఈ మేరకు బుధవారం జియాగూడ 2 బీహెచ్‌కే బస్తీ దవాఖానాలో కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా బీజేపీ గొర్ల కాపరుల సెల్ రాష్ట్ర కో కన్వీనర్ దర్పల్లి నర్సిములు హాజరై ప్రారంభించారు. చిన్నారులకు తొమ్మిది నెలల్లో నాలుగు వ్యాక్సిన్లు ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. నగరంలో మొట్టమొదటగా జియాగూడ బస్తీ దవాఖానాలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్



వ్యాక్సినేషన్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజ్‌మోహన్



చిన్నారికి ఇంజెక్షన్ ఇస్తున్న డాక్టర్ సాయిప్రసన్న

గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో 'పీర్ కాయాకల్ప్'



గోల్కొండ ఏరియా ఆస్పత్రి వద్ద డాక్టర్ మజరుల్లా, డాక్టర్ ఎంఎన్ బేగ్

గోల్కొండ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పీర్ కాయాకల్ప్ విధానాన్ని అనుసరిస్తున్నామని నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మీర్జా నజీమ్‌బేగ్ అన్నారు. పీర్ కాయాకల్ప్ పథకంలో భాగంగా బుధవారం ఆయన గోల్కొండ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఔట్‌పేషెంట్ విభాగం, ఇన్‌పేషెంట్ వార్డులను సందర్శించి రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలు, రోగులకు అందజేస్తున్న మందుల వివరాలను తెలుసుకుని తాము సందర్శించిన ఆస్పత్రులకు రేటింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రుల్లో ఉన్న వైద్య పరికరాలు, శస్త్ర చికిత్సకు ఉపయోగిస్తున్న పరికరాలను ఆయన పరిశీలించారు. గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజార్‌ఉల్లా ఆస్పత్రి వివరాలను ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ మహ్మద్ ఖాజా, రౌఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ



పూజల్లో పాల్గొన్న డీసీపీ ఆనంద్

చార్మినార్: పాతబస్తీ శివాజీనగర్‌లో అయ్యప్ప స్వామి మహాపడిపూజ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. సల్ల కృష్ణ గురుస్వామి, సల్ల మనీష్‌కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో దక్షిణ మండలం అదనపు డీసీపీ ఆనంద్ పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. సల్ల కృష్ణ గురుస్వామి అదనపు ఆయనకు శాలువా కప్పి సత్కరించారు.

5 నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు



వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

అబిడ్స్: గోషామహల్ స్టేడియంలో ఈ నెల 5 నుంచి 13 వరకు శ్రీరామ్ కథ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గోరక్షా ఫౌండేషన్ అధ్యక్షుడు మురళీమనోహర్ పలోడా, సెక్రటరీ బద్రివిశాల్ లోయా, గోవత్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు గోపాల్‌దాస్ సాంక్లా, కార్యదర్శి సజ్జన్‌లాల్ బాటి తెలిపారు. తొమ్మిది రోజుల పాటు గో ఉత్పత్తులు, గో సేవ, గో రక్షణపై దేశంలోని పలు మఠాల అధిపతులు, ఆధ్యాత్మిక గురువులు బోధిస్తారన్నారు. ప్రతిరోజూ సాయంత్రం ఈ బోధనలు ఉంటాయన్నారు. శ్రీరామ్ కథను సంత్ మహరాజ్, రాధాకృష్ణాజీ మహరాజ్, రాజేంద్ర దాస్ మహరాజ్, కపిల్ గోపాల్ సరస్వతి, కృష్ణ చంద్రాజీ మహరాజ్ బోధనలు చేస్తారని వివరించారు. 6వ తేదీన ఆధ్యాత్మిక గురువు చిన్నజీయర్‌స్వామి పాల్గొని గోవులపై బోధిస్తారన్నారు. 13న రాజ్యాభిషేకం ఉంటుందని, ఈ వేడుకలకు కేంద్ర మంత్రి రూపాలా, రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొంటారని వివరించారు.

బుల్కాపూర్ నాలాలో పూడికతీత

సాక్షి ఎఫెక్ట్..

గోల్కొండ: బుల్కాపూర్ నాలా నిర్వహణ అధ్వానం అనే శీర్షికతో 'సాక్షి'లో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించారు. బుల్కాపూర్ నాలాలో వ్యర్థాల డంపింగ్‌తో అధ్వానంగా మారింది. దీంతో పాటు నాలాల్లో పెరిగిన పిచ్చిమొక్కల కారణంగా నాలాలో మురికి నీరు ముందుకు కదలకుండా పోయింది. దీంతో పలు ప్రాంతాలలో మురికినీరు పొంగిపొర్లేది. గత రెండు రోజుల నుంచి అధికారులు హకీంపేట్, విరాట్ నగర్ కుంట తదితర ప్రాంతాలలోని బుల్కాపూర్ నాలాలో పూడికతీత పనులు చేపట్టారు.



పూడిక తీసిన అనంతరం బుల్కాపూర్ నాలా

లూయిస్ బ్రెయిలీకి నివాళి



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ హఫందీ

డబీర్‌పురా: దారుషిఫాలోని ప్రభుత్వ అంధుల బాలుర ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో బుధవారం అంధుల పితామహుడు లూయిస్ బ్రెయిలీ 214వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్లైండ్ స్టూడెంట్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ హఫందీ పాల్గొని లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పత్తర్‌గట్టి కార్పొరేటర్ సోహెల్ ఖాద్రీ, రిటైర్డ్ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ఎస్.వెంకటరాములు, అంధుల పాఠశాల హెచ్ఎం అలివేలు మంగ దదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమం'పై అవగాహనకు ప్రోత్సాహం అవసరం

- ప్రజల్లో అవగాహన కల్పించే వ్యక్తులు, సంస్థలను ప్రోత్సహించాలి
- సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు రాజమౌళి



సైకిల్ యాత్ర ప్రారంభిస్తున్న రాజమౌళి

లక్డీకాపూల్: ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించే వ్యక్తులు, సంస్థలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు బి.రాజమౌళి పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేస్తూ రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాలు, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాంతాలు, దేవాలయాలను సందర్శించుకునే పొన్నాల గౌరీశంకర్(65) చేపట్టిన సైకిల్ యాత్రను బుధవారం మాసబ్‌టాంక్‌లోని సమాచార భవన్ వద్ద ఆయన ప్రారంభించారు. ఆల్వాల్‌కు చెందిన గౌరీశంకర్ ఆరోగ్యం, పర్యావరణం, పచ్చదనం గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 2000 సంవత్సరం నుంచి దేశ వ్యాప్త సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ... రోజుకు 60 కిలోమీటర్లమేర సైకిల్ యాత్ర చేయనున్నట్లు తెలిపారు. యాత్రలో భాగంగా యువకులు, విద్యార్థులకు ఆరోగ్యం పర్యావరణం, విద్య ప్రాధాన్యతల పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. రోడ్డు పక్కన ఉండే నర్సరీల నుంచి పండ్లు, పూల మొక్కలు సేకరించి సమీపంలోని గ్రామాల్లో నాటిస్తానన్నారు. సైకిల్ యాత్రలో భాగంగా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులను కలువనున్నట్లు తెలిపారు. 60 రోజుల పాటు సైకిల్ యాత్ర కొనసాగనుందన్నారు. కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు నాగయ్య కాంబ్లీ, సంయుక్త సంచాలకులు డి.ఎస్.జగన్, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రం అందజేస్తున్న డాక్టర్ శిల్పిని, డాక్టర్ అన్నపూర్ణ

బహదూర్‌పురా: ఈ నెల 18న ప్రారంభించనున్న కంటి వెలుగు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ బుధవారం జంగమ్మెట్ ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ శిల్పిని బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ మోజం ఖాన్‌ను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్ సలీంను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. కార్యక్రమంలో అలియాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పొన్నం అన్నపూర్ణ, ఉందాబజార్ యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ వీణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారికి జైలు శిక్ష

సంతోష్‌నగర్: నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి వరకు వ్యాపారం నిర్వహిస్తున్న వ్యక్తికి బుధవారం నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిసల్‌బండలో మహ్మద్ హఫీజుద్దీన్ (50) నఫీజ్ కేఫ్ నిర్వహిస్తున్నాడు. నిబంధనలను ఉల్లంఘిస్తూ అర్ధరాత్రి వరకు షాపు నిర్వహిస్తుండటంతో హఫీజుద్దీన్‌పై కేసు నమోదు చేసుకొని నాంపల్లి కోర్టులో హాజరు పర్చగా కోర్టు ఐదు రోజుల శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

రూ.500 డ్రా చేస్తే.. రూ.2,500 వచ్చాయి

గౌలిపురా: పాతబస్తీ హరిబౌలిలోని ఎస్‌డీఎఫ్‌సీ ఏటీఎం కేంద్రంలో కొంతమంది ఖాతాదారులకు బంపర్ ఆఫర్ తగిలింది. రూ.500లు డ్రా చేయగా.. రూ.2,500 వచ్చాయి. దీంతో వినియోగదారుడు మరోసారి ప్రయత్నించగా మళ్లీ రూ.2,500 వచ్చాయి. ఈ విషయం తెలుసుకున్న మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ ఎ.శివకుమార్ వెంటనే స్పందించి సంబంధిత బ్యాంక్ అధికారులకు సమాచారం అందజేసి సమస్యను పరిష్కరించారు.

నుమాయిష్‌లో సందర్శకుల సందడి

గన్‌ఫౌండ్రీ: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న 82వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) సందర్శకులతో కిటకిటలాడుతుంది. ఈ నెల 1వ తేదీన ప్రారంభమైన నుమాయిష్‌ను ఇప్పటి వరకు 22 వేల మంది సందర్శించగా బుధవారం 7వేలకు పైగా సందర్శించినట్లు ఎగ్జిబిషన్ సొసైటీ బుకింగ్ కమిటీ చైర్మన్ హన్మంతు తెలిపారు. చిన్నపిల్లల కోసం ఏర్పాటు చేసిన అమ్యూజ్‌మెంట్ ఎంతగానో అలరిస్తుందని పేర్కొన్నారు.

గోవా పీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



యాకుత్‌పురా: నగరంలో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల శిక్షణ శిబిరానికి హాజరైన గోవా పీసీసీ అధ్యక్షుడు గిరిష్ చోదంకర్‌ను బుధవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి జినకరి నరేష్ కలిశారు. రానున్న ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని ఆయన వివరించారని నరేష్ తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం

గౌలిపురా: ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటకు వెళ్లిన గృహిణి అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మహ్మద్ అంజద్ అలీ తెలిపిన వివరాల మేరకు.. తలాబ్‌కట్టా నషేమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన షేక్ మహ్మద్, హసీనా బీ (30) దంపతులు. ఈ నెల 1న సాయంత్రం 5.30 గంటలకు హసీనా బీ ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లింది. అనంతరం తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో తన భార్య కనిపించడం లేదని షేక్ మహ్మద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆచూకి తెలిసిన వారు 040–27854798లో సమాచారం అందించాలన్నారు.

మరో ఘటనలో యువకుడు..

టైలర్ పని నిమిత్తం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన యువకుడు కనిపించకుండా పోయిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తలాబ్‌కట్ట చాచా గ్యారేజీ ప్రాంతానికి చెందిన మహ్మద్ అస్మత్ ఆలం కుమారుడు మహ్మద్ ఇమ్రోజ్ ఆలం (18) గత నెల 27న ఇంటి నుంచి వెళ్లాడు. అనంతరం తిరిగి రాలేదు. ఈ నెల 1న ఇన్‌స్టాగామ్ ఐడీ నుంచి ఎవరో ఫోన్ చేసి ఇమ్రోజ్ ఆలం తన వద్దే ఉన్నాడని చెప్పారు. అనంతరం అందుబాటులో లేకపోవడంతో కుమారుడు కనిపించడం లేదని అస్మత్ ఆలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆచూకి తెలిసిన వారు 040–27854798లో సమాచారం అందించాలన్నారు.

మరో ఘటనలో మహిళ..

ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన మహిళ కనిపించకుండా పోయిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తలాబ్‌కట్టా జహంగీర్‌నగర్‌కు చెందిన ఖైసర్ ఉన్నీసా(35) ఈ నెల 18న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లింది. అనంతరం తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన తల్లి మెహరున్నీసా స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆచూకి తెలిసిన వారు 040–27854798లో సమాచారం అందించాలన్నారు.

ఉద్యోగుల పదోన్నతులకు ప్రభుత్వం సిద్ధం

గన్‌ఫౌండ్రీ: ప్రభుత్వం ఉద్యోగుల పదోన్నతులు కల్పించేందుకు సిద్ధంగా ఉందని మంత్రి హరీష్‌రావు అన్నారు. ఉద్యోగ సంఘాలు పట్టుదలకు పోకుండా వస్తే వారంలో పదోన్నతులు ఇచ్చే బాధ్యత తమదే అన్నారు. బుధవారం అబిడ్స్ రెడ్డి హాస్టల్‌లో తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం నూతన సంవత్సర డైరీ, కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యాన పంటల వైపు రైతులను, సాగు వైపు యువతను మళ్లించడానికి వ్యవసాయ అధికారులు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు అనూరాధ, ప్రధాన కార్యదర్శి కృపాకర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో సర్దార్ మహల్

- హెరిటేజ్ కట్టడంగా గుర్తించినా మరమ్మతులు చేపట్టని వైనం
- పురాతన భవనాన్ని సంరక్షించాలని కోరుతున్న ప్రజలు



సర్దార్‌మహల్ భవనం

చార్మినార్: సర్దార్ మహల్ భవనం శిథిలావస్థకు చేరింది. ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ ఈ భవనాన్ని హెరిటేజ్ భవనంగా గుర్తించింది. అయితే శిథిలావస్థకు చేరిన భవనానికి మరమ్మతులు చేసేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. భవనంలోని నిజాం కాలం నాటి చెక్క మెట్లు విరిగిపోయాయి. గత కొన్నేళ్లుగా సర్దార్‌మహల్ భవనంలో జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయాలు కొనసాగేవి. సర్కిల్–6,7,8,9,10 కార్యాలయాల్లోని డీఎంసీలతో పాటు ఇంజినీరింగ్, జనన, మరణ ధృవీకరణ, ఏఎంహెచ్‌ఓ, యూసీడీ, టౌన్ ప్లానింగ్ విభాగాలకు చెందిన కార్యాలయాలు కొనసాగేవి. శిథిలావస్థకు చేరిన ఈ భవనంలోనే ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహించారు. గత రెండేళ్ల క్రితం చాంద్రాయణ గుట్టలోని సర్కి పూల్‌బాగ్‌కు కార్యాలయాలను షిఫ్ట్ చేశారు. దీంతో ప్రస్తుతం సర్దార్ మహల్ పూర్తిగా నిర్మానుష్యంగా మారి మరింత శిథిలావస్థకు చేరుకుంది.

ఇదీ చరిత్ర..

ఆరవ నిజాం మహబూబ్ అలీ పాషా సతీమణి అయిన సర్దార్ బేగం ఈ భవనంలో నివసించేది. దీంతో ఈ భవనానికి సర్దార్ మహల్ అనే పేరు వచ్చినట్లు పూర్వికులు చెబుతున్నారు. 1911 వరకు ఈ భవనంలో ఆయన సతీమణి నివాసం ఉండేదని చరిత్ర చెబుతుంది. ఆమె భర్త నిజాం మహబూబ్ అలీ పాషా మాత్రం పురానీహవేలీలోని రాజభవనంలో ఉండేవారని చెబుతున్నారు. ఆయన అనంతరం ఆయన కుమారుడైన 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ రాజ్యాధికారం చేపట్టినప్పటికి ఈ భవనంలో సర్దార్ బేగం నివాసముండేదని సమాచారం. నిజాం కాలం అంతరించిన అనంతరం ఈ భవనాన్ని భారత ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవడంతో ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగాయి.

1969 నుంచి కార్యాలయాలు..

సర్దార్ మహల్ భవనంలో 1969 సంవత్సరం నుంచి బల్దియా(మున్సిపల్) కార్యాలయాలు కొనసాగి గత రెండేళ్ల క్రితం తరలిపోయాయి. పూర్తి స్థాయి మరమ్మతులు చేపట్టకపోవడంతో పాటు కొత్త భవన నిర్మాణం అందుబాటులోకి రావడంతో కార్యాలయాలు తరలిపోయాయి. ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరిన భవనానికి వెంటనే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.